# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 354
పేజీలు : 08 | వెల: రూ.5/-

సోమవారం
నవంబర్ 17, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



4లో..

- అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా పనిచేయాలి.
- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- ఐనవోలు జాతరపై అధికారులతో సమీక్ష

## పత్తి కొనుగోళ్లపై.. ప్రతిష్టంభన



వివరాలు2లో..




వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లపై తీవ్ర గందరగోళం నెలకొంది. పత్తి కొనుగోళ్లపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తీరును నిరసిస్తూ రైతులు, జిన్నింగ్ మిల్లర్ల యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్త, కొత్త కొర్రీలతో సీసీఐ ఇబ్బందులు పెట్టడాన్ని నిరసిస్తూ సోమవారం మార్కెట్ యార్డులో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. కేంద్రం, రాష్ట్రాల తీరుతో 322 జిన్నింగ్ మూతపడ్డాయని ఆరోపించారు. సీసీఐ దిగివచ్చి కొనుగోళ్లకు సానుకూలత వ్యక్తం చేస్తేనే రైతులకు న్యాయం జరిగే పరిస్థితి నెలకొంది. సీసీఐ తీరును నిరసిస్తూ సోమవారం నుంచి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు మిల్లర్లు ప్రకటించడంలో రైతులు ఆగమవుతున్నారు. ఇప్పటికే ఏరిన పత్తిని ఎక్కడ అమ్ముకోవాలో తెలియక రైతులు సతమతమవుతున్నారు. గత కొద్ది రోజులుగా అధిక మొత్తంలో పత్తి మార్కెట్ కు వస్తున్న క్రమంలో కొనుగోళ్లను నిలిపివేస్తే రైతులకు అప్పులు మిగిలి ఆత్మహత్యలే శరణ్యం అయ్యే పరిస్థితి నెలకొంది. -వరంగల్ వాయిస్ ప్రతినిధి

- సీసీఐ తీరుపై ఆగ్రహం
- కేంద్రం, రాష్ట్రాల తీరును నిరసిస్తూ ఆందోళన
- ఎనుమాముల మార్కెట్‌లో నిలిచిన కొనుగోళ్లు
- మూత పడిన 322 జిన్నింగ్ మిల్లులు
- ఆగమవుతున్న రైతన్నలు



2లో..

## పద్మాక్షి ఆలయాన్ని సందర్శించిన.. విద్యాశంకర భారతీ మహాస్వామి


## ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ AIWF
తెలంగాణ రాష్ట్రం Regd No. 38/SE/2023

## రౌండ్ టేబుల్ సమావేశం

తేది: 18.11.2025 మంగళవారం మధ్యాహ్నం 2.30 గం॥లకు
స్థలం: ప్రెస్ క్లబ్ హైదరాబాద్, సోమాజీగూడ హైదరాబాద్,

**చేనేత సమస్యల పరిష్కారంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వివక్ష**

**ముఖ్య అతిథులు, వక్తలు**

ఈటల రాజేందర్ గారు పార్లమెంటు సభ్యులు
బి. మహేష్‌కుమార్ గౌడ్ ఎమ్మెల్సీ గారు, అధ్యక్షులు, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ
కె. తారక రామారావు, ఎమ్మెల్యే గారు, వర్కింగ్ ప్రెసిడెంట్, బి.ఆర్.ఎస్ పార్టీ
ఎన్.రామ్‌చంద్రరావు మాజీ ఎమ్మెల్సీ గారు, అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ (టి.జి.)
ఎం. కోదండరామ్ మాజీ ఎమ్మెల్సీ గారు, అధ్యక్షులు, తెలంగాణ జన సమితి పార్టీ
ఎల్.రమణ ఎమ్మెల్సీ గారు
తీన్‌మార్ మల్లన్న ఎమ్మెల్సీ గారు
కూనంనేని సాంబశివరావు ఎమ్మెల్యే గారు, సిపిఐ పార్టీ
చింత ప్రభాకర్ ఎమ్మెల్యే గారు
రాపోలు ఆనంద భాస్కర్ గారు, మాజీ రాజ్యసభ సభ్యులు
ఈరవత్రి అనిల్ కుమార్ మాజీ ఎమ్మెల్యే గారు, చైర్మన్, తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
చెరుపల్లి సీతారాములు మాజీ ఎమ్మెల్సీ గారు
జాన్ వెస్లి గారు సిపిఎం పార్టీ
టి.చిరంజీవులు, ఐఏఎస్ (రిటైర్డ్) గారు
దాసు సురేష్ గారు, అధ్యక్షులు, బిసి రాజ్యాధికార సమితి
బండారు ఆనంద ప్రసాద్ గారు, జాతీయ అధ్యక్షులు, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్
కటకం నర్సింగరావు గారు, వ్యవస్థాపకులు, మన ఆలోచన సాధన సమితి
కందగట్ల స్వామి గారు, అధ్యక్షులు, అఖిల భారత పద్మశాలి సంఘం
వల్లకాటి రాజ్‌కుమార్ గారు, అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం
కమర్తపు మురళి గారు, అధ్యక్షులు, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం
డి.నర్సింహారెడ్డి గారు, చేనేత విశ్లేషకులు
వనం శాంతికుమార్ గారు, అధ్యక్షులు, తెలంగాణ చేనేత కార్మిక సంఘం
పాశికంటి లక్ష్మీనర్సయ్య గారు, అధ్యక్షులు, తెలంగాణ చేనేత కార్మిక సంఘం
చెరుకు స్వామి గారు, అధ్యక్షులు, ఎల్‌బి నగర్ చేనేత సంఘం
సామల భాస్కర్ గారు, పుట్టపాక చేనేత సంఘం
ముదిగొండ శ్రీనివాస్ గారు, అధ్యక్షులు, సిద్దిపేట చేనేత పారిశ్రామిక సంఘం
భారతి వాసుదేవులు గారు, అధ్యక్షులు, పోచంపల్లి చేనేత సంఘం

**సమస్యల పరిష్కారానికై సూచనలు సలహాలు మరియు భవిష్యత్తు కార్యాచరన**

1. అమలు కాని రూ.33 కోట్ల చేనేత రుణ మాఫీ పథకం
2. 13 సం॥ల నుండి చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడం
3. చేనేత సహకార సంఘాల పెండింగ్ బకాయిలు విడుదల చేయడంలో జాప్యం
4. చేనేత వస్త్రాల కొనుగోలుకై మార్కెటింగ్ సదుపాయం లేదు
5. చేనేత ముడి సరుకులపై 5 శాతం మరియు చేనేత వస్త్రాలపై 18 శాతం జిఎస్‌టి తొలగించాలి
6. చేనేత కార్మికులకు జీవితకాలం ఆరోగ్య భీమా మరియు జీవిత భీమా సౌకర్యం రూ.5 లక్షలు కల్పించాలి.
7. జియో ట్యాగ్ నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగాలి.
8. అన్ని ప్రభుత్వ శాఖలలో మరియు ప్రభుత్వ రంగ సంస్థలలో చేనేత ఉత్పత్తులను మాత్రమే వాడాలని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలి.
9. పెట్టుబడి సహాయం కింద రూ.5 లక్షలు రాయితీతో కూడిన రుణాలు మంజూరు చేయాలి.
10. చేనేతలకు హౌస్ కమ్ వర్క్ షెడ్ పథకం ప్రవేశ పెట్టి ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలి.
11. ఎన్నికలలో మరియు నామినేటెడ్ పదవులలో చేనేతలకు ప్రాధాన్యం కల్పించాలి
12. చేనేతకు వార్షిక బడ్జెట్ 2000/- కోట్ల రూపాయలు కేటాయించాలి.

వాసిబత్తిని రాజేశం, అధ్యక్షులు 9849913108
చోళ రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి 9949992810
గవ్వల శంకర్, కోశాధికారి 9948423424
వనం శాంతికుమార్, కన్వీనర్ 9885689903
కర్నాటి మనోహార్, అధ్యక్షులు గ్రేటర్ హైదరాబాద్ 9553977547
గద్దం వెంకటేశ్వర్లు, కోఆర్డినేటర్ 9177737883
రాపోలు జగన్, జాతీయ అధికార ప్రతినిధి 9494997608

అన్ని చేనేత సహకార సంఘాలు మరియు కార్మిక సంఘాలకు ఆహ్వానము

ALL INDIA WEAVERS FEDERATION (AIWF) TELANGANA




8లో..

## ప్రీస్కూల్ చిన్నారులకు.. 100 మి.లీ పాలు

- పౌష్టికాహార లోపంలేని తెలంగాణను నిర్మిద్దాం
- చిన్నారులను ఆరోగ్యంగా ఉంచడమే ప్రభుత్వ లక్ష్యం
- అంగన్వాడి కేంద్రాలపై నమ్మకం కలిగేలా వ్యవహరించాలి
- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అంగన్వాడి కేంద్రాలు
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



# పత్తి కొనుగోళ్లపై.. ప్రతిష్టంభన

- సీసీఐ తీరుపై ఆగ్రహం
- కేంద్రం, రాష్ట్రాల తీరును నిరసిస్తూ ఆందోళన
- ఎనుమాముల మార్కెట్‌లో నిలిచిన కొనుగోళ్లు
- మూత పడిన 322 జిన్నింగ్ మిల్లులు
- ఆగమవుతున్న రైతన్నలు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** పత్తి కొనుగోళ్లపై ఉమ్మడి వరంగల్ జిల్లా రైతుల్లో ఆందోళన నెలకొంది. తీసిన పత్తిని అమ్ముకోలేక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. పత్తి రైతుల బాధలపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు స్పందిస్తూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతుంటే ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు ఏం చేస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రశ్నించారు. మద్ధతు ధర రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే.. మంత్రులు, ఎమ్మెల్యేలు జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో ఉన్నారని ఫైర్ అయ్యారు. రైతులకు మద్దతు ధర కోసం బీఆర్ఎస్ నిరసనకు దిగుతుందని వెల్లడించారు. పత్తి రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారన్నారు.



### రైతన్నల ఆగమాగం..

ఆరుగాలం కష్టించి పత్తిని పండించిన తెలంగాణ రైతన్నలు, నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో మార్కెట్ యార్డుల్లో పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కళ్ల ముందే పండించిన పత్తి ఈ చలికాలపు తేమకు పాడవుతుంటే ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలేమో మొద్దు నిద్ర వీడడంలేదని మండిపడ్డారు. నెల రోజుల్లో 28 లక్షల టన్నుల కొనుగోలు లక్ష్యం కాగా కేవలం 1.12 లక్షల టన్నుల పత్తి కొనుగోలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్ల సంక్షోభానికి ఇది అద్దం పడుతోందంటున్నారు. తేమశాతం, కపాస్ మొబైల్ యాప్ రిజిస్ట్రేషన్, మిల్లుల గ్రేడింగ్ అంటూ కుంటి సాకులతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పత్తి కొనుగోలు నిరాకరిస్తుంటే, దానికి జిన్నింగ్ మిల్లుల అవినీతి తోడై రైతన్న నడ్డి విరుస్తున్నాయని ఆరోపిస్తున్నారు. మద్ధతు ధర దొరకక, మధ్య దళారులకు తెగనమ్ముకుని రైతులు నష్టాల పాలవుతున్నారన్నారు.

### నిరవధిక బంద్..

సీసీఐ క్లిష్టమైన నిబంధనలకు వ్యతిరేకంగా సోమవారం నుంచి నిరవధికంగా పత్తి కొనుగోళ్లు బంద్ చేసినట్లు కాటన్ జిన్నింగ్ మిల్స్ యాజమాన్యం ప్రకటించింది. నిరవధిక బంద్ కు రైతులు, డీలర్లు, ట్రేడర్లు సహకరించాలంటూ వారు విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు బంద్ కొనసాగుతుందంటూ ప్రకటించడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే ఏరిన పత్తి ఎక్కడ పెట్టాలో తెలియక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. బయటి వాతావరణంలో పెడితే చలి కాలంలో గాలిలో ఉన్న తేమను పీల్చుకొని పత్తి పాడయ్యే అవకాశాలున్నాయి. దీంతో అటు అమ్ముకోలేక.. ఇటు దానిని దాచలేక రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమవి రైతు ప్రభుత్వం అని ప్రకటిస్తూనే రైతుల నడ్డి విరుస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




# పద్మాక్షి ఆలయాన్ని సందర్శించిన.. విద్యాశంకర భారతీ మహాస్వామి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కాకతీయుల ఆరాధ్య దైవం పద్మాక్షి అమ్మవారిని హైదరాబాద్ బెగంపేటలోని శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాధీశ్వరులు అభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామి సోమవారం దర్శించుకున్నారు. భారతీ మహాస్వామిని దేవాలయ పక్షాన వంశపారంపర్య అర్చకులు నాగిళ్ల శంకర్ శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికి పుష్పమాల సమర్పించారు. దేవాలయ వేదపండితులు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని బృందం వేదస్వస్తితో గర్భాలయంలో ప్రవేశించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. లోక రక్షణ, సనాతన ధర్మ పరిరక్షణ సంకల్పంతో విశేష పూజ, మహామంగళ హారతి నిర్వహించారు. ఇట్టి దేవాలయ పూర్వ వైభవంతోపాటు వేదం ప్రతిపాదించిన చక్కటి పురాణ విషయాలను వివరించారు. ఇట్టి దేవాలయానికి అనంతమైన అనుష్ఠాన శక్తి కలదని వివరించారు. ఇక్కడి అమ్మవారిని ధర్మదేవతగా, రాజ్యలక్ష్మిగా కొలువాలని భక్తులకు సూచించారు. కార్తీక మాసం అమ్మవారి దర్శనం చాలా సంతోషకరమైనదన్నారు. ఈ నెల 19న నిర్వహించనున్న మహాలింగార్చన పూర్వక కార్తీక దీపోత్సవం అహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చారిట్రబుల్ ట్రస్ట్ సభ్యులు సదానందం, రాజ్ కుమార్, చక్రపాణి, శరత్, నవీన్, హర్షిత్, అమర్ సింగ్, రాము తదితర భక్తులు పాల్గొని స్వామి వారికి ఫల ప్రసాదాలు అందించారు.



# జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** నవంబర్ 16, 2025న కొల్లూరులో జరిగిన జూనియర్ స్టేట్ ఆర్చరీ మీట్లో ఆర్డీఎఫ్ అకాడమీ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచి జూనియర్ నేషనల్స్‌కు ఎంపికయ్యారు. ఈ మీట్‌లో రికర్వ్ విభాగం, ఇండియన్ రౌండ్‌లలో కోచ్ బండారి భరత్ పర్యవేక్షణలో శిక్షణ పొందిన గంగరాజు, బి.మనస ప్రథమ స్థానం, పి.వినయ్ ద్వితాయ స్థానం, త్రిషూల్, బి.ఆశ్విత్ తృతీయ స్థానంలో నిలిచి పతకాలు సాధించారు. విజయం సాధించిన ఈ యువ ఆర్చర్‌లు త్వరలో రాయపూర్‌లో జరగబోయే జూనియర్ నేషనల్స్‌లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఆడెపు జనార్దన్, యాజమాన్యం ప్రత్యేకంగా ప్రశంసించింది. విద్యతో పాటు క్రీడలలో కూడా మా విద్యార్థులు రాణించడం గర్వకారణం అని పేర్కొన్నారు. కోచ్ భరత్ కృషి, విద్యార్థుల పట్టుదల అభినందనీయమన్నారు. జాతీయ స్థాయిలో దేశం తరపున ఆడబోతున్న యువ ఆర్చర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఆడెపు జనార్ధన్, వైస్ ప్రిన్సిపల్ రాజు, అకాడమిక్ హెడ్ ప్రవీణ్, ఏఓ సతీష్, సిబ్బంది సంతోష్, శ్రీధర్, మహేశ్వర్, జయశంకర్, ధన్య, సైదులు, శ్రీలత, గుంశవలీ, ధనలక్ష్మి, తిరుమల, ప్రవీణ్ అభినందనలు తెలిపారు.

# ఘనంగా రంగోత్సవ్ అవార్డ్స్ ప్రదానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ, విద్యారణ్యపురిలోని ఏకశిల హై స్కూల్‌లో వీఎస్ అకాడమి ట్యుటోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ లెవెల్ రంగోత్సవ ఆర్ట్ కంపిటీషన్ అవార్డ్స్ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో 100 మందికి పైగా విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. అందులో 38 మంది విద్యార్థులు ఇంటర్నేషనల్ లెవెల్ ఆర్ట్ పోటీకి ఎంపికయ్యారు. ఈ విశిష్ట విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థుల కృషి, వీఎస్ అకాడమి మార్గదర్శకత్వం ప్రధాన ఆధారం. కిండర్ గార్టెన్ నుంచి ఇంటర్ వరకు వివిధ తరగతుల విద్యార్థులు పాల్గొని బహుమతులు, అచీవ్‌మెంట్ సర్టిఫికేట్లు, సర్ప్రైజ్ గిఫ్టులు, గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్, బ్రాంజ్ మెడల్ వంటి పురస్కారాలను సాధించారు. ఈ కార్యక్రమంలో వీఎస్ అకాడమి ట్యుటోరియల్ ఫౌండర్ తడూరి వేణుగోపాల్ స్వామి, ప్రిన్సిపాల్ తడూరి కల్యాణి, సమన్వయకర్త కరుణాకర్, సపోర్టర్స్ టి.విజయ్ కుమార్, జయశ్రీతో పాటు అనేకమంది తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 19న చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి

**☐ హాజరు కానున్న పార్టీ నేతలు, నాయకులు**




**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారత విప్లవోద్యమ నిర్మాత ప్రతిఘటన పోరాట రూపశిల్పి కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41 వ వర్ధంతి సభ హైదరాబాదులోని సుందర విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. సోమవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 1942 క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో మద్రాస్ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న చంద్ర పుల్లారెడ్డి చదువును కొనసాగిస్తూనే ఉద్యమంలో పాల్గొన్నారని వెల్లడించారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్రం రావాలంటే బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోనే జాతీయోద్యమం నడపాలని భావించారన్నారు. నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో కూడా పాల్గొన్నారన్నారు. సీపీఐ, సీపీఎం పార్లమెంటరీ రాజకీయ విధానాలను వ్యతిరేకిస్తూ, నూతన ప్రజాస్వామిక విప్లవమే ఏకైక మార్గంగా భావించారన్నారు. భారత విప్లవోద్యమ నిర్మాణం కోసం గోదావరి నది పరివాహక ఫారెస్ట్ ప్రాంత జిల్లాలో ప్రతిఘటనోద్యమాన్ని నిర్మించారని తెలిపారు. పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతూ 1984 నవంబర్ 9న కలకత్తా నగరంలో అమరులయ్యారన్నారు. కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41 వ వర్ధంతిని పురస్కరించుకొని ఈ నెల 19వ తేదీన హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్నం 12 గంటలకు పార్టీ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. ఈ సభకు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ సాధినేని వెంకటేశ్వరరావు అధ్యక్షత వహిస్తారన్నారు. కేంద్ర కమిటీ సభ్యులు వీకే పటోలి, ఏఐకేఎంఎస్ జాతీయ నాయకులు వేములపల్లి వెంకటరామయ్య, ఏపీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.ప్రసాద్, తెలంగాణ కార్యదర్శివర్గ సభ్యులు జేవి చలపతిరావు, ఐఎఫ్ టీయూ జాతీయ నాయకులు బి.ప్రదీప్, ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ జి.ఝాన్సీ, నాయకురాలు వి.సంధ్య తదితరులు ప్రసంగిస్తారని వారు వెల్లడించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి రచించిన వివిధ గ్రంథాలలోని కొన్నింటిని కూర్పు చేసి కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి ఏరిన రచనలు అనే పుస్తకావిష్కరణ ఉంటుందన్నారు. పార్టీ నాయకులు, నేతలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు, జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్, జిల్లా అధికార ప్రతినిధి గంగుల దయాకర్, నాయకులు, బండి కోటేశ్వరరావు, పీడీఎస్ యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, పీవైఎల్ జిల్లా నాయకులు శనిగరం చరణ్, కరుణాకర్, అనిల్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



# బొద్దిరెడ్డిని సన్మానించిన మంత్రి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ బ్యాడ్మెంటన్ అసోసియేషన్ అధ్యక్షులు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని హనుమకొండలో తెలంగాణ రాష్ట్ర క్రీడలు, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకాటి శ్రీహరి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో జిల్లాలో బ్యాడ్మెంటన్, షటిల్ క్రీడల అభివృద్ధికి తనదైన శైలితో కృషి చేస్తున్నారన్నారు. యువ క్రీడా కారులను ప్రోత్సాహించడంలో ఆయన ముందుంటారన్నారు. దేశ, విదేశాల్లో జరిగే జాతీయ షటిల్ క్రీడా పోటీల్లో స్వతహాగా పాల్గొనడంతోపాటు వరంగల్, హనుమకొండ జిల్లాల నుంచి అధిక మొత్తంలో క్రీడాకారులు వివిధ పాల్గొనేలా కృషి చేస్తున్నారని వాకాటి శ్రీహరి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇచ్చి అధిక మొత్తంలో బడ్జెట్ కెటాయింపులు చేస్తోందన్నారు. వివిధ క్రీడా ప్రాంగణాల్లో మౌళిక వసతుల ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. వివిధ క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు ప్రభుత్వం తగిన గుర్తింపును ఇచ్చి ప్రోత్సహిస్తోందన్ని మంత్రి వాకాటి శ్రీహరితెలిపారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు

- **ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**
- **రూపురెడ్డి పల్లీలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం**



**వరంగల్ వాయిస్, రేగొండ :** ఆరుగాలం పండించిన వరి ధాన్యాన్ని దళాలకు అమ్మి నష్టపోవద్దని, రైతులు పండించిన ప్రతి గింజను కనుగోలు చేస్తామని భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. రేగొండ మండలం రూపిరెడ్డి పల్లి, చెన్నాపూర్ గ్రామంలో సోమవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని గిట్టుబాటు ధరను పొందాలన్నారు. రైతుల నుంచి ధాన్యం ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రేగొండ మండల అధ్యక్షులు ఇప్పకాయల నరసయ్య, టౌన్ అధ్యక్షులు ఏనుగు రవీందర్ రెడ్డి, ఎన్ఎస్ఆర్ అధినేత, రాష్ట్ర నాయకులు సంపత్ రావు, ఎంపీడీవో ఎం.వెంకటేశ్వరరావు, ఏవో పెద్ది వాసు రెడ్డి, ఏవో సారయ్య, డీఎం రాములు, పీఆర్ డీఈ రవికుమార్, ఏఈ నరిగ సంతోష్, ఏఈఓ ప్రవళిక, స్థానిక పంచాయతీ కార్యదర్శి నల్లెల సురేందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, రేగొండ పీఏసీఎస్ చైర్మెన్ నడిపెల్లి విజ్జన్ రావు, మాజీ ఎంపీపీ పున్నం లక్ష్మి రవి, మాజీ ఎంపీటసీ మైసా సుమలత–భిక్షపతి, కాంగ్రెస్ జిల్లా నాయకులు మోడెమ్ ఉమేష్ గౌడ్, బండారి దేవేందర్, కాసెట్టి రాజయ్య, నాగపురి శ్రీధర్ గౌడ్, దేవేందర్, ముదుతనపల్లి శంకరయ్య, ఓబీసీ మండల అధ్యక్షుడు పొనుగోటి వీరబ్రహ్మం, శంకర్, అల్లే దేవేందర్, నాగపురి మొగిలి గౌడ్, మంచి పెల్లి ఆనందం, యూత్ నాయకులు మేకల శివ, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



# చేప పిల్లల పంపిణీ

**వరంగల్ వాయిస్, రేగొండ :** ఉమ్మడి రేగొండ మండల కేంద్రంలోని చెరువులల్లో పోసేందుకు సోమవారం పలువురు మత్స్యకారులకు చెక్ పోస్ట్ వద్ద చేప పిల్లలను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా బాగిర్తిపేట, దమన్నపేట, చిన్నకోడెపాక, రేగొండ, తిరుమలగిరి గ్రామాల్లో ఉన్న చెరువుల్లో వేసేందుకు 11లక్షల చేప పిల్లలను అందజేసినట్లు మత్స్యశాఖ అసిస్టెంట్ కవిత తెలిపారు. రవ్వ, బొచ్చ, బంగారు తీగ రకం చేప పిల్లలను అందజేసినట్లు వెల్లడించారు. మిగతా చెరువులకు మరికొద్ది రోజుల్లో చేప పిల్లలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సిబ్బంది, కుల సంఘం సభ్యులు పాణి, నిమ్మల రమేష్, నాగరాజు, అంజి మత్స్యశాఖ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి



**☐ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**వరంగల్ వాయిస్, గణపురం :** రైతుల నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. సోమవారం గణపురం మండలంలోని ధర్మరావుపేట, బుద్ధారం, గణపురం, కొత్తపల్లి గ్రామాల్లో అధికారులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దొడ్డు రకం, సన్న రకం తేడాను స్పష్టంగా తెలియజేసేలా కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలు, క్షేత్రస్థాయి సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. రైస్ మిల్లర్లు తాలు పేరుతో రైతులకు కోతలు పెట్టవద్దని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు సకాలంలో చెల్లింపులు చేయాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కొనుగోలు ప్రక్రియ సజావుగా సక్రమంగా చేపట్టాలని రైతుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని అన్నారు. రైతుల కోసం మనం ఉన్నామన్న విషయాన్ని మర్చిపోవద్దని అధికారులకు సూచించారు.



# ప్రకృతి సేద్యంపై అవగాహన

**వరంగల్ వాయిస్, దామెర :** దామెర మండలంలోని పులుకుర్తి గ్రామంలో నేషనల్ మిషన్ ఆన్ నాచురల్ ఫామింగ్ పథకం ద్వారా 125 మంది రైతులతో వరి సాగుచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాశెట్టి లక్ష్మణ్, పేరుక సత్యం, అంకేశ్వరపు రాంబాబు, గోపు రమేష్, దండు లక్ష్మయ్య, అంకేశ్వరపు నర్సింగ్, ఏఈఓ రామకృష్ణ పాల్గొన్నారు. పకృతి సేద్యం ద్వారా వరి పండించడం వలన లాభాలు, ప్రయోజనాలను రైతులకు తెలియజేశారు. ప్రకృతి సేద్యం ద్వారా పండించిన ధాన్యం మంచి పౌష్టిక ఆహారంగా ఎలాంటి క్రిమిసంహారక మందులు లేకుండా ఉంటాయన్నారు. ఇది ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రైతులకు కావలసిన వరకు పకృతి సేద్యం ద్వారా పండించుకొని ఉపయోగించుకోవాలని ఏఈఓ రామకృష్ణ కోరారు.

# భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- ఐనవోలు జాతరపై అధికారులతో సమీక్ష



**వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి** : ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ మార్నెనీ రవీందర్ రావు సూచించారు. జాతర – 2026 పై సోమవారం హనుమకొండ ఆర్అండ్ బి గెస్ట్ హౌస్ లో పలు శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు మాట్లాడుతూ.. భక్తులు లక్షలాదిగా తరలి వచ్చే ఐనవోలు మల్లిఖార్జున స్వామి జాతరను జిల్లా ఉన్నతాధికారులు, ఎండోమెంట్ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా పనిచేసి విజయవంతం చేయాలన్నారు. ఇందుకుగాను శాశ్వత ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యంగా తాగు నీరు వసతి, మరుగు దొడ్లు, పారిశ్యూధ్యం, క్యూ లైన్ల క్రమబద్ధీకరించాలన్నారు. మహిళా భక్తుల సౌకర్యార్ధం జల్లు స్నానాలు, దుస్తులు మార్చుకొనే గదులు, ఆరోగ్య శిభిరాలు ఏర్పాటు తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. పోలీస్, విద్యుత్, హెల్త్, రెవెన్యూ, మండల పరిషత్, మున్సిపాలిటీ, మిషన్ భగీరథ, ఆర్.అండ్.బి, పీఆర్, ఆర్టీసీ, ఎక్సైజ్, ఫైర్, ఐబీ తదితర శాఖల అధికారులు ఎండోమెంట్ అధికారులతో సమన్వయం చేసుకొని జాతరను విజయవంతం చేసే దిశగా ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. అలాగే సంక్రాంతి పండుగ రోజు జరిగే పెద్ద రథంకు ఎలాంటి అవరోధాలు తలెత్తకుండా కంట్రోల్ చేయాలన్నారు. మహా శివరాత్రి రోజు పెద్ద పట్నం వేసినప్పుడు తొక్కిసలాటలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జాతరలో విక్రయించే పూజా సామగ్రి, కొబ్బరి కాయల ధరలు సాధారణ స్థాయిలో ఉండేలా చూడాలన్నారు. ఈ సంవత్సరం మేడారం సమ్మక్క సారక్క జాతర సందర్భంగా జాతరకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. అందుకు తగినట్టుగా జాతర వరకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ఆలయ ఈవో సుధాకర్, ధర్మకర్తలు పలు శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

☐ కలెక్టర్ రాహుల్ శర్మ

**వరంగల్ వాయిస్ మల్హర్ (భూపాలపల్లి) :** జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది బయోమెట్రిక్ హాజరు విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో బయోమెట్రిక్ హాజరు నమోదుపై అన్ని శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బయోమెట్రిక్ హాజరు పరిశీలన ఆధారంగా మాత్రమే వేతనాలు చెల్లించే విధానం అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. హాజరులో నిర్లక్ష్యం కనిపించినట్లయితే సంబంధిత శాఖాధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు సమయ పాలన పాటిస్తూ బయోమెట్రిక్ హాజరు పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ రవి, ట్రైని డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తక్షణమే పరిష్కరించాలి..

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా సత్వర పరిష్కారం చూపించేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రజావాణి నిర్వహించిన కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని దరఖాస్తులు స్వీకరించారు. అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా, బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ రవి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొమురవెల్లి మల్లన్న కళ్యాణం ఘనంగా నిర్వహిస్తాం: మంత్రి కొండా సురేఖ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** కొమురవెల్లి మల్లన్న కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రకటించారు. హైదరాబాద్ సచివాలయంనుంచి సిద్దిపేట జిల్లా ఎండోమెంట్ ఉన్నతాధికారులతో ఆమె సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శ్రీ మల్లికార్జున స్వామివారి కళ్యాణం, జాతరను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై మంత్రి విస్తృతంగా సమీక్షించారు. భక్తుల రాకపోకలు, భద్రత, తాగునీరు, పారిశుద్ధ్యం, పార్కింగ్ వంటి సౌకర్యాల ఏర్పాటులో అన్ని శాఖల సమన్వయం అత్యంత కీలకమని సూచించారు. అలాగే ఆలయ అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను జాతర ప్రారంభానికి ముందే పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



# ప్రజావాణికి వినతుల వెల్లువ

### పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్న కలెక్టర్ స్నేహ శబరీష్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 139 వినతులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన వినతుల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశపు హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డిలకు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు వినతులను అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, గృహ నిర్మాణ, మున్సిపల్, తదితర సమస్యలపై ప్రజలు 139 వినతులను కలెక్టర్, అదనపు కలెక్టర్లకు అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు వినతి పత్రాలను అందజేస్తూ తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ను కోరగా అక్కడే ఉన్న సంబంధిత శాఖల అధికారులను వినతుల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా పలు మండలాలకు సంబంధించిన వినతులపై పరిష్కార చర్యల నిమిత్తం తహసిల్దార్లను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తిలో ఉచిత వైద్య శిబిరం

### ప్రారంభించిన కలెక్టర్ స్నేహ శబరీష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వరంగల్ కాకతీయ వైద్య కళాశాల, హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఎల్కతుర్తి మండల ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎల్కతుర్తి గ్రామ పంచాయతీ, ఎంపీడీవో కార్యాలయాల ప్రాంగణంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రారంభించారు. మెగా వైద్య శిబిరంలో ఓపీ నమోదు, హెల్ప్ డెస్క్, ల్యాబ్, ప్రాథమిక పరీక్షల కౌంటర్లను కలెక్టర్ పరిశీలించారు. జనరల్ ఫిజీషియన్ విభాగాలతోపాటు ఎముకలు, శస్త్ర చికిత్స, పిల్లలు, చెవి ముక్కు గొంతు, చర్మవ్యాధి, ఛాతీ, కంటి, స్త్రీ వైద్య నిపుణులు వైద్య సేవలను అందిస్తుండగా కలెక్టర్ సందర్శించి ఆయా విభాగాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీ కౌంటర్ ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన వైద్య సేవలను అందించాలని వైద్యులకు సూచించారు. ఈ శిబిరంలో కాకతీయ వైద్య కళాశాల, ఎంజీఎం ఆసుపత్రి నుంచి 38 మంది స్పెషలిస్ట్ వైద్యులు, 60 మంది పీజీ విద్యార్థులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొనగా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తరపున 35 మంది డాక్టర్లు, సూపర్వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల బృందం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్య, ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిశ్చంద్రారెడ్డి, డీఎంహెచ్ ఓ డాక్టర్ అప్పయ్య, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, స్థానిక తహసీల్దార్ ప్రసాద్ రావు, ఎంపీడీపీ విజయ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ సంతాజీ, సీఐ రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## దామెర మండలం లాదెళ్లలో..

వరంగల్ వాయిస్, దామెర : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ జిల్లా దామెర మండలం లాదెళ్ల గ్రామంలోని రూరల్ హెల్త్ సెంటర్ లో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా చైర్మన్, పాలకవర్గం మాట్లాడుతూ లాదెళ్ల గ్రామంలో 89 మందికి బీపీ, షుగర్, రక్త పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. ఈ ఆరోగ్య శిబిరంలో రెడ్ క్రాస్ డాక్టర్లు డాక్టర్ జె.కిషన్ రావు, డాక్టర్ మొహమ్మద్ తయార్ మసూద్, రెడ్ క్రాస్ సిబ్బంది గుల్లెపెల్లి శివకుమార్, ఉపేందర్, సల్ల రజాకర్, శ్రీకాంత్, నర్సింహ చారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వైభవోపేతంగా మహా రుద్ర యాగం

- వేద ఘోషతో మార్మోగిన ఆలయ ప్రాంగణం
- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల పట్టణ కేంద్రంలోని శ్రీ కుంకుమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం కార్తీక మాస మహా రుద్ర యాగ కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి దంపతులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉదయం విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, యాగశాల ప్రవేశం, రుత్విక్ వరణం, గోపూజ కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు రుద్ర నమకం, చమకాలను పఠిస్తూ మహా రుద్ర హోమాన్ని శాస్త్రోక్తంగా ప్రారంభించారు. లోక కల్యాణం, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కాంక్షిస్తూ స్థానిక ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో తలపెట్టిన శ్రీ మహా రుద్ర యాగం 51 మంది వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 159 హోమ గుండాలు, 644 జంటలు ఈ హోమంలో పాల్గొనటం విశేషం. 'ఓం నమః శివాయ' అనే పంచాక్షరీ మంత్రం, వేద మంత్రాల ఘోషతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. యాగంలో పాల్గొన్న భక్తులు, ప్రతికూల శక్తుల నుంచి రక్షణ, కుటుంబంలో సంతోషం లభిస్తాయని విశ్వసిస్తూ శివుని అనుగ్రహం కోసం మొక్కులు చెల్లించుకున్నారు. యాగంలో పాలుపంచుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వందలాది మంది భక్తులకు ఎలాంటి ఆటంకం లేకుండా భోజన సదుపాయం కల్పించే ఉద్దేశంతో ఇనుగాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. యాగ స్థలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండడంతో పాటు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు విశిష్ట సేవలను అందించారు. వీరితోపాటు అగ్నిమాపక సిబ్బంది, వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, విద్యుత్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో సేవలందించి యాగకురతో దిగ్విజయంగా ముగియడంలో భాగస్వాములయ్యారు.



# లేఖన పోటీల్లో పాల్గొనండి

- అందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలి
- సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారత తపాలా శాఖ 'థాయ్ ఆఖర్' అన్న థీమ్ తో '"లెటర్ టు మై రోల్ మోడల్' (నా ఆదర్శ వ్యక్తికి లేఖ) అనే అంశంపై నిర్వహిస్తున్న చేతి రాతలతో రాసే లేఖల పోటీలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ కోరారు. ముత్యాల లాంటి చేతిరాత విద్యార్థులకు ఒక వరం లాంటిదని, ఈ ఆధునిక యుగంలో ఇంటర్నెట్లు, సెల్ ఫోన్లు వచ్చాక చేతిరాతలతో రాసే లేఖలు కరువయ్యాయన్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని నిర్వహిస్తున్న ఈ పోటీలో 18 సంవత్సరాల లోపు పిల్లలు ఒక విభాగంగా 18 సంవత్సరాలు పైబడిన వారు రెండో విభాగంగా ఉంటారన్నారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషలలో లేఖలు పోస్టల్ శాఖ వారి ఇన్ల్యాండ్ లెటర్, ఎన్వలప్ కవర్లను మాత్రమే ఉపయోగించి రాయవలసి ఉంటుందన్నారు. డిసెంబర్ 8 లేఖలు 'థాయ్ ఆఖర్, చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్, తెలంగాణ సర్కిల్' అన్న చిరునామాకు పోస్ట్ చేయాలని, వచ్చే యేడాది జనవరి 23 న ఫలితాలను ప్రకటించి సర్కిల్ స్థాయిలో మొదటి బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు, జాతీయస్థాయిలో ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలుగా అందించనున్నారని ఆయన తెలిపారు. పూర్తి వివరాల కోసం దగ్గరలో ఉన్న పోస్ట్ ఆఫీస్ లో కానీ మీ ఇంటికి వచ్చే పోస్ట్ మాన్ ను సంప్రదించవచ్చునని ఆయన పేర్కొన్నారు.

# ఆకట్టుకున్న కవి సమ్మేళనం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా కేంద్రంలోని వరంగల్ గ్రంథాలయంలో సోమవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కవి సమ్మేళనం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి జిల్లా కేంద్ర గ్రంథాలయం గ్రేడ్ వన్ లైబ్రేరియన్ టి.శ్రీలత అధ్యక్షత వహించగా అతిథిగా ప్రముఖ కవి కొండ యాదగిరి, అనుసంధాన కర్తగా ప్రముఖ గాయకుడు టయ్యాల వ్యవహరించారు. రచయిత చింతం నాగరాజు, లైబ్రేరియన్ చినబాబు ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రేక్షకులను అలరించింది. కవులు పద్య కవిత, వచన కవిత, పాటల రూపకంగా పుస్తకం లైబ్రరీల ప్రయోజనం గురించి చక్కగా వివరించారు. ఈ సందర్భంగా కవులను, రచయితలను, గాయకులను గ్రంథాలయ పక్షాన ఘనంగా సన్మానించారు. అధ్యక్షులు శ్రీలత మాట్లాడుతూ జ్ఞాన జ్యోతులను పంచే గ్రంథాలయాలను విరివిగా ఉపయోగించుకోవాలని సూచించారు. అతిథి కొండా యాదగిరి మాట్లాడుతూ అలనాటి నుంచి గ్రంథాలయాల సేవలను కొనియాడారు. నా అభివృద్ధికి ఈ గ్రంథాలయమే పునాది అని ఆచార్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బందితోపాటు పాఠకులు పాల్గొన్నారు.



# తిరుపతి, శ్రీశైలంనకు రాజధాని సర్వీస్

□ ప్రారంభించిన రీజనల్ మేనేజర్ విజయ భాను

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ రీజియన్ ప్రయాణికులకు ఆర్టీసీ శుభవార్త చెప్పింది. తిరుపతి, శ్రీశైలం పుణ్యక్షేత్రాలకు హనుమకొండ నుంచి రాజధాని సర్వీసును ప్రారంభించినట్లు వరంగల్ రీజనల్ మేనేజర్ డి.విజయ భాను తెలిపారు. ప్రతిరోజు రాజధాని సర్వీసు హనుమకొండలో ఉదయం 9 గంటలకు బయలుదేరి సాయంత్రం 6 గంటలకు శ్రీశైలం చేరుకుంటుంది. ఇందుకు గాను టికెట్ చార్జి రూ.1,050 ఉంటుందన్నారు. ఎల్ బీ నగర్ నుంచి శ్రీశైలం వరకు రూ.680 టికెట్ ఛార్జ్ ఉంటుందన్నారు. అలాగే హనుమకొండ నుంచి తిరుపతికి రాజధాని సర్వీసు ఉదయం 8.40 గంటలకు బయలుదేరి రాత్రి 11.10 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. హనుమకొండ నుంచి తిరుపతికి టికెట్ ధర రూ.1,720 గా నిర్ణయించారు. హైదరాబాదు నుంచి తిరుపతికి రూ.1,240 ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులందరూ సద్వినియోగం చేసుకొని సురక్షితంగా, సుఖవంతంగా, శుభప్రదంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసి పుణ్యక్షేత్ర దర్శనం చేసుకోవాలని విజయ భాను కోరారు.



# భూమిపూజలో నాయకులు

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** డివిజన్ కేంద్రంలోని బృందావన్ ఎస్టేట్ లో తొర్రూరు పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరి ప్రసాద్ సోమవారం నూతన గృహ నిర్మాణ భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి, నాయకులు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, రామసహాయం కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్ 23 మందికి జరిమాన

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 23 మందిని సోమవారం కోర్టులో హాజరు పరుచగా, వరంగల్ సెకండ్ క్లాస్ ముజిస్ట్రేట్ కె.లక్ష్మీనారాయణ రూ.25,400 జరిమాన విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ కె.సుజాత తెలిపారు. వాహన ప్రమాదాలు అరికట్టడమే లక్ష్యంగా వరంగల్ నగర పరిధిలో నిత్యం వివిధ ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆమె కోరారు.



# మామునూరులో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందికి శిక్షణ

**వరంగల్ వాయిస్, మామునూరు :** నాలుగో బెటాలియన్ లో సోమవారం 7వ బెటాలియన్ ఎస్ డీఆర్ఎఫ్ సిబ్బంది 100మందికి నెల రోజుల శిక్షణకు ముఖ్య అతిథిగా 4వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పి.శ్రీనివాసరావు వచ్చి శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విపత్తులు సంభవించునప్పుడు తక్షణమే సహాయక చర్యలు అందించేందుకు ప్రతి బెటాలియన్ లో 100మంది సిబ్బందితో ఒక ఎస్ డీఆర్ఎఫ్ బృందంను ఏర్పాటు చేసి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. వారికి మెడికల్ ఫస్ట్ రెస్పాండర్ కోర్స్, సీఎస్ఎస్ఆర్ కోర్స్, ఏడీఆర్సీ కోర్స్, రోప్ రెస్క్యూ ఆపరేషన్ వంటి కోర్సులలో 30 రోజులపాటు నిష్ణాతులైన వారిచే శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే మొదట మామునూర్ బెటాలియన్ సిబ్బందికి ఇవ్వడం జరిగింది. ఇప్పుడు 7వ బెటాలియన్ ఎస్ డీఆర్ఎఫ్ సిబ్బందికి శిక్షణ ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ వీరన్న, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు రవి, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్స్, 7వ బెటాలియన్ శిక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

# కన్నుల పండువగా కార్తీక దీపోత్సవం



**వరంగల్ వాయిస్, జనగామ :** కార్తీక మాసం సందర్భంగా జిల్లా కేంద్రంలోని మూడో వార్డు పరిధిలో ఉన్న బాలాజీ నగర్ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో సోమవారం కార్తీక దీపోత్సవం కన్నుల పండుగగా జరిగింది. కార్తీకమాసం 26వ రోజు సందర్భంగా కన్న పరశురాములు-సత్తెమ్మ, దూడల రమేష్-శోభారాణి దంపతులచే ఆలయ పూజారి మారుపాక శ్యాంప్రసాద్ ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. నమః పార్వతీ పతయే హర హర మహాదేవ శంభో శంకర శివోహం.. అంటూ ఆధ్యాత్మిక శోభతో భక్తులు కార్తిక దీపాలు వెలిగించి కైలాస వాసుడు పరమశివుని యొక్క నామస్మరణం చేశారు. కార్తీకమాసం పరమేశ్వరుని ప్రతిరోజు విశేషమైన అలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహించడం వల్ల భక్తులకు స్వామివారి కృపా కటాక్షాలు ఆశిస్సులు లభిస్తాయని నమ్మకం. దీపోత్సవం అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు వెలిగించిన కార్తీక దీపాలు ఆలయంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.అనంతరం విష్ణు హరిహరల పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లగిశెట్టి పద్మావతి, దోసపాటి శ్రీలక్ష్మి, మాదారపు కల్పన, నవ్య, దూడల నిషిత,బండోజు సరళ, గూడేల్లి సంధ్య, గట్టు విజయ, విమల,కేమెడీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

# ప్రత్యేక లోక్ అదాలత్ లో 5,025 కేసులు పరిష్కారం

☐ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్ కు విశేష స్పందన లభించిందని, వీటి ద్వారా 5,025 కేసులు పరిష్కారమయ్యాయని, సైబర్ క్రైమ్ కేసుల్లో 89 లక్షలకు పైగా రిఫండ్ మొత్తాన్ని బాధితులకు అందజేయాల్సిందిగా కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా రాజీకి అవకాశం ఉండి పరిష్కరించిన మొత్తం కేసుల్లో ఎఫ్ఐఆర్ కేసులు-1,011, పెట్టి కేసులు-1,281, డ్రంకెన్ అండ్ డ్రైవ్, మోటార్ వెహికల్ చట్టం కేసులు-2,533, సైబర్ కేసులు-200 పరిష్కరించడం ద్వారా బాధితులకు సంబంధించి వివిధ బ్యాంక్ ఖాతాల్లో నిలుపుదల చేసిన రూ.89,43,506 లను బాధితులకు అందజేశాల్సిందిగా కోర్టు ఉత్తర్వులు వెలుబడించిందని తెలిపారు. రాజీ మార్గం రాజ మార్గమని, లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాలకు న్యాయం జరుగుతుందని అవగాహన కల్పించి కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ అధికారులను, సిబ్బంది పోలీస్ కమిషనర్ అభినందించారు. అదేవిధంగా లోక్ అదాలత్ సద్వినియోగం సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయసేవాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

**పొగమంచుతో జర భద్రం..**

వాతావరణంలో పొగమంచు తీవ్రత పెరగటంతో వీలైనంత వరకు వాహనదారులు రాత్రి, తెల్లవారుజామున ప్రయాణాలు మానుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు. వాతావరణంలో పొగమంచు తీవ్రత పెరగడం కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ప్రజలను వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రకటన చేస్తూ. రాత్రి, తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కారణంగా రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు, పాదాచారులను గుర్తించడం, వీక్షించే సామర్ధ్యం తక్కువగా వుంటుంది. ఈ సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశాలు ఉన్నందున, ప్రజలు అత్యవసరమైతే తప్ప ఈ సమయాల్లో ప్రయాణాలను మానుకోగలరని వరంగల్ సీపీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే పొగమంచు ఎక్కువగా ఉండే సమయంలో వాహనాలు నడుపుతున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీపీ సూచిస్తూ. వాహనాలను వేగంగా నడపొద్దని, వాహనదారులు శ్రద్ధతో, నిదానంగా ప్రయాణించాలి. తక్కువ వీక్షించే సామర్ధ్యం కారణంగా ఇతర వాహనాలు, పాదచారులు, మలుపులు, రోడ్డు విభాగాలు సరిగా కనిపించక ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున, హెడ్‌లైట్లను లో బీమ్‌లో ఉంచి, ఫాగ్ లైట్లను వాడాలని సూచించారు. అత్యవసర సమయాల్లో ప్రయాణం తప్పనిసరి అయితే వాహనాల స్థితిని ముందుగానే తనిఖీ చేసుకోవంతో పాటు ముఖ్యంగా బ్రేకులు, లైట్లు, టైర్లు సరిగా ఉన్నాయో లేదో సరి చూసుకోవాలని. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, ఆకస్మికంగా ఓవర్‌టేక్ చేయడం, ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించడం వంటి ప్రమాదకరమైన చర్యలకు పాల్పడవద్దని. పోలీసుల సూచనలతో పాటు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ వాహనదారులు వారి గమ్యస్థానాలకు క్షేమంగా చేరుకోవడమే వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రధాన లక్ష్యమని సీపీ వెల్లడించారు.



# వరంగల్ పబ్లిక్ స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్

☐ విద్యార్థులకు ప్రశంసల వెల్లువ

**వరంగల్ వాయిస్, పరకాల :** వరంగల్ పబ్లిక్ స్కూల్, హనుమకొండలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. భూమి పొరల నిర్మాణం, వాటి లక్షణాలు, ప్రాముఖ్యత వంటి అంశాలను పెద్దూరి ఆదిత్రి, నందిత, నేత్ర, శివాని, విశ్వాస్, బుష్రా వివరించి సందర్శకులను ఆకట్టుకున్నారు. భూమి అంతర్భాగంపై రూపొందించిన మోడల్స్ ద్వారా విద్యార్థులు శాస్త్రీయ సమాచారం అందించడంతో పాటు భూగర్భ పరిణామాలు, భూమి క్రస్ట్, మాంటిల్, కోర్ నిర్మాణాల గురించి స్పష్టంగా వివరించారు. విద్యార్థుల ప్రదర్శనను సందర్శించిన ఉపాధ్యాయులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టీచర్ బుష్రా, హౌజ్ ఇంచార్జ్ శ్రీదేవి టీచర్ పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. శాస్త్రీయ జిజ్ఞాస పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయని వారు పేర్కొన్నారు.

# సీఎస్ఐ పాఠశాల అభివృద్ధికి అడహాక్ కమిటీ ఎన్నిక

◆ పూర్వ విద్యార్థుల కృషిని అభినందించిన కరస్పాండెంట్ రమాజ్యోతి



**వరంగల్ వాయిస్, పరకాల :** చదువుకున్న పాఠశాలను కాపాడుకోవడం కోసం పూర్వ విద్యార్థులంతా ముందుకు రావడం చాలా గర్వంగా ఉందని సీఎస్ఐ మిషన్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ రమా జ్యోతి అన్నారు. సీఎస్ఐ మిషన్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం సిఎస్ఐ మిషన్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ రమాజ్యోతి అధ్యక్షతన సోమవారం పూర్వ విద్యార్థులు సమావేశం కావడం జరిగింది. ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం సిఎస్ఐ కరీంనగర్ అధ్యక్ష మండల మేనేజ్మెంట్ కు లోబడి పాఠశాల అభివృద్ధి – కార్యచరణ రూపొందించడం కోసం పూర్వ విద్యార్థుల నుంచి తాత్కలిక అడహాక్ కమిటీని వేయడం జరిగింది. అడ హాక్ కమిటీ చైర్మన్ గా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎబ్బి, ముఖ్య సలహాదారులుగా కెజె.థామస్ (రిటైర్డ్ హెచ్ఎం), ఓ.చంద్రశేఖర్ (పీజీహెచ్ఎం) ఎం.జేమ్స్, సీఎస్ఐ కరీంనగర్ అధ్యక్ష మండల మేనేజ్మెంట్ కు ఎక్స్ అఫీషియో (ప్రత్యేక హోదా)గా పరిగణంలోకి తీసుకుంటూ ఆడహాక్ కమిటీ కన్వీనర్ గా ఒంటేరు ప్రభాకర్, కో-కన్వీనర్ గా కాజీపేట రవీందర్, సెక్రటరీగా చొల్లేటి సునేందర్, కోశాధికారిగా బి.అశోక్, సలహాదారుడుగా ఒంటేరు చక్రి, కన్స్ట్రక్షన్స్ కన్వీనర్స్ గా బొచ్చు కళ్యాణ్, పాలకుర్తి తిరుపతిలను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ ఒంటేరు ప్రభాకర్ మాట్లాడుతూ 1948 సంవత్సరంలో స్థాపించి 77 సంవత్సరాలుగా వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు విద్యా ద్వారా తోడ్పాటు అందించిన సీఎస్ఐ మిషన్ ఉన్నత పాఠశాల పూర్వవైభవమే పూర్వ విద్యార్థులు కృషి చేయాలని ఐక్యతగా స్వచ్ఛందంగా ముందుకు రావడం జరిగింది అన్నారు. ఆయా నిధులను బ్యాంకు అకౌంట్ తీసి అందులో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. కాబట్టి సి ఎస్ ఐ పూర్వ విద్యార్థులు ఎక్కడ ఉన్నా.. ఎంతటి హోదాలో ఉన్న పాఠశాల అభివృద్ధి కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా వచ్చే నెల డిసెంబర్ 7న 11 గంటలకు అడహాక్ కమిటీ సమావేశమై పాఠశాల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనులపై కార్యచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో పాఠశాల పూర్వ విద్యార్థులు బొచ్చు అనంతరావు, ఒంటేరు మధు, బొచ్చు శ్రీనివాస్, పాస్టర్ బొచ్చు ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.





# హీరోగా ఎంట్రీ ఇస్తున్న రమేశ్ బాబు తనయుడు

ఘట్టమనేని కుటుంబం నుంచి మూడో తరం హీరో ఎంట్రీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సూపర్ స్టార్ మహేష్ బాబు సోదరుడు దివంగత రమేష్ బాబు తనయుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అవుతున్న విషయం తెలిసిందే. 'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' వంటి సినిమాలకు దర్శకత్వం వహించిన అజయ్ భూపతి ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతుండగా, సినిమా నుంచి మరో ఆసక్తికర అప్డేట్ బయటకు వచ్చింది.ఈ చిత్రంలో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ రవీనా టాండన్ కుమార్తె రషా తడానీ అధికారికంగా కన్ఫర్మ్ అయ్యింది. ఇది ఆమెకు తొలి తెలుగు చిత్రం. ఈ సందర్భంగా టీం ప్రత్యేక పోస్టర్ విడుదల చేస్తూ రషాకు గ్రాండ్ వెల్‌కమ్ చెప్పింది. కొద్ది రోజులుగా ఆమె నటిస్తుందంటూ ప్రచారం జరుగుతుండగా, సోమవారం విడుదలైన పోస్టర్‌తో దీనికి అధికారిక క్లారిటీ వచ్చింది. 'ఃః4' పేరుతో ప్రచారం జరుగుతున్న ఈ ప్రాజెక్ట్ నవంబర్ నెలలోనే రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్లనుంది. బాలీవుడ్‌లో రషా అరంగేట్రం చేసియగా, అప్పుడు 'ఆజాద్' సినిమాలో ఒకే ఒక్క స్పెషల్ సాంగ్‌తోనే ఆమె ఓవర్‌నైట్ స్టార్ అయింది. ఎనర్జిటిక్ డ్యాన్స్ మూవ్‌మెంట్‌లు, స్క్రీన్ ప్రెజెన్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఇప్పుడు అదే జోష్‌తో తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. జయకృష్ణ ఘట్టమనేనిని న్యూ ఏజ్ లవ్ స్టోరీతో ఇండస్ట్రీక్రి పరిచయం చేస్తున్నారు. తిరుపతి ? చిత్తూరు నేపథ్యంతో ఈ చిత్రం తెరకెక్కనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల రిలీజ్ చేసిన కాన్సెప్ట్ పోస్టర్ కూడా ఈ విషయాన్నే స్పష్టం చేసింది. ఈ చిత్రం తెలుగు సినిమాల్లో కొత్త ట్రెండ్‌ను సెట్ చేసేలా ఉంటుందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. టాలీవుడ్ టాప్ ప్రొడ్యూసర్ అశ్వినీదత్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. 'రాజకుమారుడు'తో మహేష్ బాబును హీరోగా పరిచయం చేసిన అశ్వినీదత్, ఇప్పుడు ఘట్టమనేని ఫ్యామిలీ నుంచి మూడో తరం హీరోను కూడా పరిచయం చేయడం విశేషం. చందమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఈ చిత్రానికి 'శ్రీనివాస మంగాపురం' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన రానుందని మూవీ వర్గాలు చెబుతున్నాయి.

# తన ఫోటోలతో ఫేక్ సోషల్ అకౌంట్లు

## సైబర్ మోసాలపై నటి అదితి రావు హైదరీ ఆందోళన

నటి అదితి రావు హైదరీ సోషల్ మీడియాలో తన పేరుతో జరుగుతున్న మోసాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పలు దేశీయ, పాన్ ఇండియా ప్రాజెక్టులతో బిజీగా ఉన్న అదితి, పెళ్లి తర్వాత కూడా తన క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదని నిరూపిస్తూనే ఉంది. తరచూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఆమె, తాజాగా వాట్సాప్‌లో తన ఫోటోలను ఉపయోగిస్తూ ఫేక్ అకౌంట్లు సృష్టిస్తున్నారని వెల్లడిరచారు. అదితి షేర్ చేసిన స్క్రీన్‌షాట్‌లో, ఒక వ్యక్తి ఆమె పేరు, ఫోటోలను ఉపయోగిస్తూ ఫోటోగ్రాఫర్లకు ఫోటోషూట్ల పేరుతో మెసేజులు పంపుతున్నట్లు కనిపించింది. ఈ విషయం తెలిసిన వెంటనే ఇన్‌స్టాగ్రామ్‌లో క్లారిటీ ఇస్తూ అభిమానులను అప్రమత్తం చేశారు.ఈ రోజు కొంతమంది నాకు చెప్పిన విషయాన్ని మీతో పంచుకుంటున్నాను. వాట్సాప్‌లో నా ఫోటోలను ఉపయోగిస్తూ ఎవరో 'ఫోటోషూట్' కోసం మెసేజులు పంపుతున్నారు. అవి నేను పంపినవి కావు. నేను ఎప్పుడూ నా పర్సనల్ నంబర్‌ను వర్క్ కోసం ఉపయోగించను. నా అధికారిక పనులు అన్నీ నా టీమ్ ద్వారానే జరుగుతాయి. అలాంటి మెసేజులు వస్తే వెంటనే నా జీసరఇనీనిని।ఇబి టీమ్‌కి తెలియజేయండి. నాకు ఎప్పుడూ అండగా నిలిచే అభిమానులకు ధన్యవాదాలు, అని అదితి పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇక అదితి రావు హైదరి కొద్ది రోజు క్రితం సిద్దార్థ్‌ని ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. ఈ జంట ప్రస్తుతం వైవాహిక జీవితంతో పాటు ప్రొఫెషనల్ లైఫ్‌ని బ్యాలెన్స్ చేస్తూ దూసుకుపోతుంది.



# డిసెబర్ 25న దండోరా

విలక్షణ నటులు శివాజీ, నవదీప్, నందు, బిందు మాధవి కాంబోలో తెరకెక్కిన చిత్రం 'దండోరా' . రవి కృష్ణ, మణిక, అనూష, రాధ్య ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. అన్నికార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబర్ 25న థియేటర్లకు వచ్చేందుకు రెడీ అయింది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా సోమవారం ఉదయం ఈ చిత్రం టీజర్ రిలీజ్ చేశారు. టీజర్ చూస్తుంటే పక్కా తెలంగాణ మాండలికంలో వ్యంగ్యంగా తెరకెక్కించిన చిత్రంగా తెలుస్తోండగా, ముఖ్యంగా నాలుగు పుస్తకాలు చదివి లోకమంతా తెలిసినోడి లెక్క మాట్లాడకు... నీకు తెలియని లోకం ఇంకోటి ఉంది అంటూ సాగే డైలాగులు, సన్నివేశాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. మీరూ ఓ లుక్కేయండి. గతంలో నేషనల్ అవార్డ్ దక్కించుకున్న చిత్రం 'కలర్ ఫోటో',ఆపై నవ్వులు పూయించిన 'బెదురులంక 2012' చిత్రాలను నిర్మించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మాత రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ 'దండోరా' చిత్రాన్ని నిర్మించారు. మురళీ కాంత్ దర్శకత్వం వహించాడు. మార్క్ కె. రాబిన్ సంగీతం అందించాడు.

# గోవాలో 20న అంతర్జాతీయ చలనచిత్రోత్సవం

## ఆరంభ వేడుకల్లో బాలయ్యకు సన్మానం



ఒకప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో తెలుగు వారికి సరైన ప్రాధాన్యత లభిస్తుండేది కాదు. కానీ ఇప్పుడు కాలం మారింది. యావత్ భారత సినీ రంగం తెలుగు వారివైపు ఆసక్తిగా చూస్తున్నాయి. తెలుగు సినిమాలే ఇవాళ జాతీయ స్థాయిలో దిశా నిర్దేశర చేస్తున్నాయి. అంతర్జాతీయ యవనికపై భారతీయ సినిమా సత్తాను చాటుతోంది కూడా తెలుగు సినిమాలే! ఈ నేపథ్యంలో తెలుగు సినిమా రంగానికి చెందిన కథానాయకులకు, దర్శకులకు అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో తగిన గుర్తింపు లభిస్తోంది. ఇప్పుడు నందమూరి బాలకృష్ణను సత్కరించబోతున్నారు. నవంబర్ 20న గోవా లో 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం ప్రారంభం కానుంది. ఈ ఆరంభ వేడుకల్లోనే బాలకృష్ణను ఘనంగా సత్కరించబోతున్నారు. ఐదు దశాబ్దాల పాటు నందమూరి బాలకృష్ణ తెలుగు సినిమా రంగంలో హీరోగా రాణిస్తున్నారు. నందమూరి తారక రామారావు నట వారసుడిగా తెలుగు సినిమా రంగంలోకి అడుగుపెట్టిన బాలకృష్ణ మడమ తిప్పకుండా యాభై సంవత్సరాలు ముందుకు సాగుతున్నారు. ఎన్నో బ్లాక్ బస్టర్స్ ను తన ఖాతాలో వేసుకున్నారు.



# వైబ్స్ క్రియేట్ చేస్తున్న నాగ్

అక్కినేని నాగార్జున నటించిన ఐకానిక్ మూవీ శివ ఇటీవలే గ్రాండ్‌గా రీరిలీజ్ అయిన విషయం తెలిసిందే. రీరిలీజ్‌లో సూపర్ రెస్పాన్స్ రాబట్టుకుంది శివ. ఇక మరోసారి శివ సినిమా నాటి వైబ్స్ క్రియేట్ చేస్తున్నాడు నాగార్జున. చైన్ బ్రాస్‌లెట్‌ను అరచేతిలో మడిచి పట్టుకున్న నాగార్జున బ్లాక్ డ్రెస్‌కు మ్యాచ్ అయ్యే గాగుల్స్‌తో స్టైలిష్‌గా రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై కూర్చొని కెమెరాకు ఫోజులిచ్చాడు. అయినప్పటికీ అతడి చరిష్మా శాశ్వతమైనది.. సొగసైనది..మరపురానిది..' అనే క్యాప్షన్‌తో పోస్ట్ చేసిన తాజా స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఆరు పదుల వయస్సు దాటినా కుర్ర హీరోలకు ఏ మాత్రం తగ్గేదేలే అంటూ తాజా స్టిల్స్‌తో చెప్పకనే చెప్పేస్తున్నాడు నాగార్జున.ఈ ఏడాది కుబేర, కూలీ సినిమాలతో సూపర్ హిట్స్ అందుకున్నాడు టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగార్జున. నాగార్జున ప్రస్తుతం కెరీర్‌లో ల్యాండ్ మార్క్ సినిమాగా నిలిచిపోయే 100వ ప్రాజెక్ట్‌పై వర్క్ చేస్తున్నాడు.






# ప్రీస్కూల్ చిన్నారులకు.. 100 మి.లీ పాలు

- పౌష్టికాహార లోపంలేని తెలంగాణను నిర్మిద్దాం
- చిన్నారులను ఆరోగ్యంగా ఉంచడమే ప్రభుత్వ లక్ష్యం
- అంగన్వాడి కేంద్రాలపై నమ్మకం కలిగేలా వ్యవహరించాలి
- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అంగన్వాడి కేంద్రాలు
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**వరంగల్ వాయిస్, ములుగు :** పౌష్టికాహార లోపంలేని తెలంగాణను నిర్మించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. అందులో భాగంగానే సోమవారం ములుగు జిల్లా కేంద్రంలోని కృష్ణా కాలనీ అంగన్వాడీ కేంద్రంలో రాష్ట్రంలోనే తొలిసారిగా పైలట్ ప్రాజెక్ట్ గా ప్రీస్కూల్ చిన్నారులకు ప్రతీరోజు 100 మి.లీ పాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్., ఐటీడీఏ పీవో చిత్రమిశ్ర, అదనపు కలెక్టర్ మహేందర్ జీలతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పోషకాహార లోపాన్ని అధిగమించి తెలంగాణ రాష్ట్రాన్ని పోషకాహార లోప రహిత తెలంగాణగా మార్చడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో 3 నుంచి 6 సంవత్సరాల వయసు కలిగిన పిల్లలకు ప్రతిరోజు పాలను అందజేయనున్నట్లు వెల్లడించారు. ములుగు జిల్లాలో పేదరికంలో ఉన్న పిల్లలు అధిక సంఖ్యలో ఉన్నందున ఈ నూతన కార్యక్రమాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించినట్లు వివరించారు. పిల్లలకు అందించే ప్రతి ఆహారాన్ని అంగన్వాడీ టీచర్లు ప్రతిరోజు పరిశీలించాలని, అనారోగ్యానికి గురి చేసే వస్తువులు వచ్చిన పక్షంలో వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి అంగన్వాడి సెంటర్లను బలోపేతం చేయడానికి ఇప్పటికే పలు నిర్ణయాలు తీసుకున్నారని, ప్రతి టీచర్ కు చీరలు పంపిణీ చేయడంతో పాటు వేతనాలను పెంచడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లల్ని అంగన్వాడి సెంటర్ లో చేర్పించాలని కోరారు. కార్పొరేట్ స్థాయి పాఠశాలకు దీటుగా సెంటర్లను బలోపేతం చేస్తున్నామని, ప్రతి సెంటర్ నిర్వాహకులు పిల్లల తల్లిదండ్రులతో నిత్యం సమావేశాలు నిర్వహించాలని సూచించారు. అంగన్వాడీ టీచర్లు అనుకోకుండా మృతి చెందిన పక్షంలో వారి పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం జీవో జారీ చేస్తుందని, సెంటర్లకు చెడ్డ పేరు రాకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తగా విధులు నిర్వహించాలని అన్నారు. ప్రజా ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లకు ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేర్చడానికి కృషి చేస్తానని, ప్రజలకు అంగన్వాడి సెంటర్ లపై నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమం విజయవంతానికి అంగన్వాడీ టీచర్లు క్రియాశీల పాత్ర వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, డీడబ్ల్యూఓ తుల రవి, సీడీపీఓ శిరీష, సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.






# స్వేరోస్ జిల్లా అధ్యక్షుడిగా మంద మనోజ్

- నియమించిన రాష్ట్ర కార్యవర్గం

**వరంగల్ వాయిస్, దామెర :** డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆలోచన, ఆశయాలకు అనుగుణంగా 13 సంవత్సరాల క్రితం ఏర్పడిన స్వేరోస్ సంస్థకు గత పది సంవత్సరాల నుంచి పనిచేస్తూ స్వేరో ఉద్యమానికి నికార్సైన స్వేరో నాయకుడిగా వివిధ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేస్తూ సంఘాన్ని బలోపేతం చేయడంలో ప్రముఖ పాత్ర పోషించిన హనుమకొండ జిల్లా పరకాల మండలం మాదారం గ్రామానికి చెందిన యువనాయకుడు మంద మనోజ్ ను హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ప్రకటించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దార మల్ల ప్రకాష్, కో కన్వీనర్ పుల్ల కిషన్ ల ఆధ్వర్యంలో ఈ ఎంపిక జరిగింది. అనంతరం జిల్లా అధ్యక్షుడు మంద మనోజ్ మాట్లాడుతూ స్వేరోస్ సంఘాన్ని మా జిల్లాలో ఉన్న 14 మండలాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజలు, విద్యార్థుల సమస్యలను ప్రధానంగా వెలికి తీసి వారికి స్వేరోస్ తరఫున అండగా నిలబడి అధికారుల ద్వారా న్యాయం జరిగే విధంగా ప్రయత్నం చేస్తామన్నారు. అన్ని గ్రామాలలో స్వేరోస్ జెండాను ఎగరవేస్తామని వెల్లడించారు. తనను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక చేసిన రాష్ట్ర కార్యవర్గానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.





# బలభద్ర వెంకటమ్మ మృతి



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** సమాచార శాఖ మాజీ సంచాలకులు బలభద్ర రాజమౌళి మాతృమూర్తి బలభద్ర వెంకటమ్మ దివంగతులయ్యారు. సోమవారం ఉదయం తమ స్వగ్రామమైన ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామంలో తీవ్ర అనారోగ్యంతో కాలం చేశారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వెంకటమ్మ అంత్యక్రియలు స్వగ్రామంలో సాయంత్రం నిర్వహించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు, వరంగల్ డీపీఆర్ఓ మహమ్మద్ అయుబ్ ఖాన్, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవ మూర్తి, ప్రముఖ వ్యాపారవేత్త మామిడాల సురేందర్ తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, గ్రామస్తులు ఆమె మృతి పట్ల సంతాపం ప్రకటించారు. దివంగత వెంకటమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.




# హడుప్సా జిల్లా స్థాయి పోటీలు

- సత్తా చాటిన విద్యాధరి స్కూల్ విద్యార్థులు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ (హడుప్సా) ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీల్లో విద్యాధరి స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఆదివారం భారతీ విద్యా భవన్ స్కూల్లో నిర్వహించిన హనుమకొండ జిల్లా స్థాయి పోటీల్లో 21 పాఠశాలల నుంచి 105 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యాధరి స్కూల్ నుంచి ఐదుగురు విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా ముగ్గురు అత్యుత్తమ ప్రతిభ చాటి విజేతలుగా నిలిచారు. తెలుగు వ్యాసరచన పోటీల్లో పదో తరగతికి చెందిన పులికంటి ఆశ్రీక ప్రథమ స్థానం, ఇంగ్లీష్ స్పీచ్ లో అద్వితేయ ప్రథమ స్థానం, తెలుగు స్పీచ్ లో నైన్త్ క్లాస్ స్టూడెంట్ నిత్య ద్వితీయ స్థానంలో నిలిచి బహుమతి గెలుచుకున్నారు. వీరందరికీ హడుప్సా జిల్లా అధ్యక్షులు తక్కలపల్లి బుచ్చిబాబు, ప్రధాన కార్యదర్శి సంతోష్ రెడ్డి, న్యాయ నిర్ణేతలు లింగారావు, తెలుగు భాష ఉపాధ్యాయులు రవికుమార్, ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ మాణిక్యరావు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటారని, భవిష్యత్తులో మరిన్ని పోటీ పరీక్షల్లో పాల్గొని విజేతలుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్, జనార్ధన్, రామారావు, వెంకటరమణ, రమణారెడ్డి, వెంకట్ రెడ్డి, మధుకర్ రెడ్డి, సతీష్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com